క్లుప్తంగా

మెనూ ప్రకారం జగనన్న గోరుముద్ద



పదార్థాల రుచి చూస్తున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. బుధవారం పాలసముద్రం ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు మంచి పౌష్టికాహారం పెట్టాలనే ఉద్దేశంతో జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం, తాజా కూరగాయలతో నాణ్యతగా భోజనం తయారు చేయాలన్నారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చేశారు. ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ, విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



సామాజిక తనిఖీ బహిరంగ సభలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

తవణంపల్లె: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టేందుకు కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ గంగాభవాని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనుల సామాజిక తనిఖీపై బహిరంగ సభ నిర్వహించారు. బహిరంగ సభలో పీడీ గంగాభవాని మాట్లాడుతూ మండలంలో 1,496 ఉపాధి పనులకు రూ.4,16,15,084 ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు చెందిన 26 పనులకు రూ.1,94,86,444, ఒక ఆర్‌డబ్ల్యూఎస్ పనికి రూ.1.08,417 వ్యయం చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్ 2022 ఆర్థిక సంవత్సరం నుంచి మార్చి 2023 వరకు జరిగిన పనులను తనిఖీ చేసినట్లు వివరించారు. మండలంలోని 32 పంచాయతీల్లో జరిగిన పనులకు సంబంధించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో కారకాంపల్లె, ఎ.గొల్లపల్లె, సరకల్లు పంచాయితీల్లో హౌసింగ్ బిల్లుల అవకతవకలు జరగడంతో రూ.14,831 రికవరీకి ఆదేశించారు. తొడతర, సరకల్లు, కారకాంపల్లె ఫీల్డు అసిస్టెంట్లు రికార్డులు సక్రమంగా సకాలంలో సమర్పించలేదని ముగ్గురికి రూ.1700 అపరాధం విధించారు. బహిరంగ సభకు డీవీఓ భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఎస్ఆర్పీలు మీరావల్లి, నాగేంద్ర బాబు, ఏపీఓ లలిత, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో పార్కింగ్ పరేషాన్!

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పార్కింగ్ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రతి విభాగం ముందు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అత్యవసర విభాగానికి ముందు రోడ్డుకు ఇరువైపులా వాహనాలను నిలిపేస్తున్నారు. ప్రసూతి విభాగం ముందు భాగం, ఓపీ, ఎంఎస్ వార్డు ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ చుట్టుముట్టేస్తున్నాయి. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా అత్యవసర విభాగం ముందు వైపు 108 వాహనం రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయాన్ని 108 సిబ్బంది అధికారులు, సెక్యూరిటీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు. సెక్యూరిటీ సిబ్బంది వాహనాల పార్కింగ్ విషయంలో ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ఆస్పత్రిలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నట్లు రోగులు చెబుతున్నారు. ఒక కొన్ని విభాగాలకు అడ్డదిడ్డంగా దారాలు కట్టేశారు. ఈ కారణంగా అత్యవసర సమయాల్లో రోగులకు అవస్థలు తప్పడం లేదు. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ తనిఖీ నేపథ్యంలో వాహనాల పార్కింగ్‌పై ఉన్న శ్రద్ధ మళ్లీ ఎందుకు మానుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు డయల్ యువర్ డీఎం

తిరుపతి అర్బన్: ప్రజలు తమ పరిధిలోని ఆర్టీసీ సమస్యలను చెప్పండి.. వెంటనే వాటికి పరిష్కారం చూపడానికి సిద్ధంగా ఉన్నామని తిరుపతి ఆర్టీసీ డిపో మేనేజర్ బాలాజీ తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు డయల్ యువర్ డీఎంను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధించి ప్రయాణికులతో పాటు ప్రజలు తమ పరిధిలోని ఆర్టీసీ సమస్యలను తెలియజేస్తే వెంటనే వాటికి పరిష్కారం చూపుతామని వెల్లడించారు. తిరుపతి డిపో పరిధికి సంబంధించి తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రామచంద్రాపురం, పాకాల, పెనుమూరు మండలాల పరిధిలోని ఆర్టీసీ సమస్యలను 9959225670 నంబర్‌కు కాల్ చేసి చెప్పవచ్చన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన వివరించారు.

ఆడుదాం..కప్పు కొట్టేద్దాం

నగరి నియోజకవర్గంలో ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మైదానాల్లో క్రీడోత్సాహం తరంగంలా ఎగసిపడుతోంది. ఆడుదాం ఆంధ్ర క్రీడలు మైదానాలకు కొత్త సొబగులు తెచ్చిపెడుతోంది. క్రీడాకారులు తమ సత్తా చాటేందుకు ఈ క్రీడలు వేదికగా మారుతున్నాయి. నియోజకవర్గంలో 90 సచివాలయాల పరిధిలో యువత నువ్వా–నేనా అన్నట్లు పోటీల్లో పాల్గొంటోంది. సత్తా చాటి రాష్ట్రస్థాయిలో మెరుస్తాం అంటోంది.

- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం–ఆంధ్ర
- క్రీడా పోటీలతో మైదానాలకు కొత్త కళ
- నియోజకవర్గంలోని 90 సచివాలయాల పరిధిలో..



నగరి డిగ్రీ కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

నగరి : క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారికి ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తూ కోచ్‌లను నియమిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తోంది. ప్రస్తుతం ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలను పురస్కరించుకుని ప్రతి సచివాలయ పరిధిలో క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. క్రీడా సామగ్రిని కూడా ప్రభుత్వం అందజేసింది. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడనున్నాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడలకు ప్రాచుర్యం కల్పించే ఉద్దేశంతో ఐదు వేర్వేరు దశల్లో పోటీలు నిర్వహించనున్నారు. గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో గెలిచిన జట్లు మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీ పడుతారు. ఇలా పోటీలు నిర్వహిస్తుండడంతో పల్లెల్లో సందడి నెలకొనడమే కాకుండా క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నింద్రలో బాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

ఇంత స్థాయిలో ఎప్పుడూ లేదు



క్రీడా కారులకు ప్రోత్సహించే విధంగా సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 47 రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నారు. సుమారు 3 లక్షల మ్యాచ్‌లు జరగనున్నాయి. రూ.12 కోట్ల ప్రైజ్ మనీ అందిస్తున్నారు. నిర్వహణకు రూ.120 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఇంత భారీ స్థాయిలో ఎప్పుడూ క్రీడా పోటీలు నిర్వహించలేదు. మా గ్రామంలో జరిగే క్రికెట్ పోటీల్లో నేను పాల్గొంటున్నాను. – మొహమ్మద్ షారూక్, క్రికెట్ క్రీడాకారుడు, మీరాసాహెబ్‌పాళెం

ప్రతిభచాటేందుకు అవకాశం



బాడ్మింటన్‌లో సాధన చేస్తున్నా. ప్రస్తుతం గ్రామంలోనే పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. బాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో పాల్గొంటున్నా. ఆడుదాం ఆంధ్ర పోటీలు నాలాంటి గ్రామీణ క్రీడాకారులకు మంచి అవకాశం. ప్రతిభ కనబరచి పై స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనాలన్న తలంపుతో పోటీ పడుతున్నా.
– జయశ్రీ, నింద్ర, నింద్ర మండలం

క్రికెట్ అంటే మక్కువ



క్రికెట్ అంటే చాలా ఇష్టం. ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొంటూ ఉంటా. ప్రస్తుతం ఆడుదాం ఆంధ్రా పోటీల్లో మా జట్టు పేరు నమోదు చేశా. తగిన గుర్తింపు పొందేందుకు అవకాశం లభించింది. ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీల వరకు వెళ్లేందుకు ప్రయత్నిస్తా.
–ఏ.మైకేల్, క్రికెట్ జట్టు కెప్టెన్, నందిమంగళం, పుత్తూరు మండలం

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లతో విద్యార్థులు, తల్లిదండ్రులు

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ రవికుమార్ చేతుల మీదుగా 8 మంది విద్యార్థులకు ఒక్కొక్కటి రూ.33 వేలు విలువజేసే ట్యాబ్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు మొదటి విడతలో పాఠశాలను రూ. 22 లక్షల వ్యయంతో ఆధునికీకరించినట్లు తెలిపారు. రెండో ఫేజ్‌లో రూ.1.5 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ భవనం నిర్మించిమన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ట్యాబ్‌లను అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేపడుతున్న కృషిని గుర్తించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యరాజ్, ఎ.హరి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,వలంటీర్స్ పాల్గొన్నారు.

వైభవంగా ఆరుద్ర ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో చంద్రమౌళీశ్వరస్వామి

నగరి : పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో, కీళపట్టు చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆరుద్ర పూజలు వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేసి, పలురకాల హారతులు ఇచ్చారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తులను కూడా సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



కరకంఠేశ్వర ఆలయంలో ఊరేగింపు

అవాస్తవాలతో ప్రజలను నమ్మించలేరు



మాట్లాడుతున్న గోవిందయ్య

వెదురుకుప్పం: అవాస్తవాలు, దుష్ప్రచారాలు చేస్తే ప్రజలు నమ్మరని, నమ్మించి మోసం చేసే టీడీపీని ఎప్పుడో జనం బహిష్కరించారని బొమ్మయ్యపల్లె సర్పంచ్ చొక్కా గోవిందయ్య అన్నారు. బొమ్మయ్యపల్లె పంచాయతీలో పర్యటించిన టీడీపీ ఇన్‌చార్జ్ థామస్ గ్రామాల్లో తాగునీరు లేదు, బోర్లు పనిచేయలేదు, పైపులు అమ్ముకున్నట్లు చేసిన ఆరోపణలను బుధవారం సర్పంచ్ ఖండించారు. గ్రామాల్లో పర్యటించినప్పుడు వాస్తవాలు అడిగి తెలుసుకుని మాట్లాడాలన్నారు. గతంలో టీడీపీలో ఉన్న తాను ఎన్నో అవమానాలు, కష్టనష్టాలు పడినట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజలకు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుతో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి సమక్షంలో సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీలో చేరిన తాను పంచాయతీలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. బొమ్మయ్యపల్లె దళితవాడలో రూ. 35 లక్షలతో కమ్యూనిటీ భవనం, అదేవిధంగా రూ.25 లక్షలతో ఓవర్ హెడ్‌ట్యాంకు నిర్మాణం, బొమ్మయ్యపల్లెలో కొత్తగా బోరు, పాఠశాలకు కొత్త బోరు, మోటారుతో పాటు 10 గ్రామాల్లో కొత్తగా బోర్లు వేసి మోటార్లు అమర్చినట్లు గుర్తుచేశారు. తెట్టుగుండ్లపల్లెకు వెళ్లే రోడ్డు దుస్థితిలో ఉండడంతో రూ.2.50 లక్షలతో మరమ్మతులు, దేవళంపేటలో రూ.5.50 లక్షలతో 140 మీటర్ల డ్రైనేజీ కాలువ నిర్మాణం, మనవర్తికొత్తూరు గ్రామంలో రూ.16 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం వంటి పనులు చేస్తున్నా కంటికి కనిపించలేదా ? అని ప్రశ్నించారు. తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. దళిత సర్పంచ్‌పై ఇలాంటి ఆరోపణలు భావ్యం కాదన్నారు.

సిబ్బంది సెలవుపెడితే రిజిస్టర్‌లో నమోదు చేయరా?

- పలమనేరు ఎంపీడీవో తీరుపై జెడ్పీ చైర్మన్ ఆగ్రహం



పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు

పలమనేరు: సెలవుల రిజిస్టర్‌లో సిబ్బంది సీఎల్ కూడా నమోదు చేయక పోయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని ఎంపీడీవో విద్యాసాగర్‌పై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో చాలామంది సిబ్బంది విధులకు హాజరుకాలేదు. అటెండెన్స్ రిజిస్టర్‌లో కూడా సెలవు నమోదు కాలేదు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మండలస్థాయి పరిపాలనలో కీలకమైన ఎంపీడీవో ఇంత నిర్లక్ష్యంగా ఉంటే పాలన ఎలా ఉంటుందో బాగా అర్థమవుతోందని అసహనం వ్యక్తం చేశారు. ఇంకోసారి ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా అందుకు ఎంపీడీవోనే బాధ్యత వహించాల్సి ఉంటుందని, చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ వైద్యం



మందుల కిట్ అందిస్తున్న మండల వైద్యాధికారి గిరి

శ్రీరంగరాజపురం : గ్రామీణ ప్రాంత ప్రజలకు వారి ఇళ్ల వద్దే ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యం అని మండల వైద్యాధికారి డాక్టర్ గిరి అన్నారు. బుధవారం శ్రీరంగరాజపురం, పద్మపురం సచివాలయం పరిధిలోని పద్మపురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను నిర్వహించారు. ఈ వైద్య పరీక్షలకు వచ్చిన రోగులు, గర్భిణులతో డాక్టర్ గిరి మాట్లాడారు. పాలు, కోడిగుడ్లు, చిక్కీలు, రాగి, గోధుమ, ఎండు ఖర్జూరం తదితరాలను పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం వ్యాధి నిరోధకశక్తితో పాటు పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, రోగాలు బారిన పడిన వారు త్వరగా కోలుకుంటారని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మండలవ్యాప్తంగా అర్హులైన రోగులకు 228 కంటి అద్దాలను ఎంపీడీఓ కృష్ణయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్‌నాయుడు, నర్స్ గంగాభవానీ, కవిత, నిరోషా, శ్రీనివాసులు, లోకేశ్వరి, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐకు క్యాష్ రివార్డు



రివార్డు అందుకుంటున్న ఎస్ఐ మారుతి

సదుం: ఎస్ఐ మారుతి బుధవారం చిత్తూరులో ఎస్పీ రిశాంత్‌రెడ్డి చేతులు మీదుగా బుధవారం క్యాష్ రివార్డు అందుకున్నారు. మండల కేంద్రంలో అక్టోబరు 3న జరిగిన వరస చోరీల కేసు దర్యాప్తులో ప్రతిభ చూపడంతో క్యాష్ రివార్డు లభించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు చెప్పారు.

జోరందుకున్న ఆడుదాం ఆంధ్రా



కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

పుత్తూరు: ఆడుదాం ఆంధ్రా పోటీలు రెండవ రోజు బుధవారం జోరందుకొన్నాయి. పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, గేట్ పుత్తూరులోని తమిళ పాఠశాల మైదానంలో జరిగిన వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో పోటీలను మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోటీల్లో ప్రతి జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. పోటీలలో రాణించిన వారికి ఉజ్వల భవిషత్ ఉంటుందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పోటీలను మున్సిపల్ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఈలు హేమశేఖర్‌రెడ్డి, కార్తికేయన్ పర్యవేక్షించారు.

ఆడుదాం..ఆంధ్రా ఓ చరిత్ర

విజయపురం : ఆడుదాం..ఆంధ్రా దేశ చరిత్రలో ఒక మైలురాయి అని విజయపురం వైస్ ఎంపీపీ బాలాజీ అన్నారు. బుధవారం గంగమాంబపురం, కాళికాపురం, ఇల్లత్తూరు, విజయపురం, ఎం అగరం, కేవీపురం సచివాలయ పరిధిలో జరుగుతున్న ఆడుదాం...ఆంధ్రా క్రీడా పోటీలను వైస్ ఎంపీపీ బాలాజీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపినాథ్ తిలకించారు. ఈ సందర్భంగా వైఎస్ ఎంపీపీ మాట్లాడుతూ ప్రతిభ చాటేందుకు గ్రామీణ క్రీడాకారులకు ఇది మంచి వేదికని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సురేంద్రకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

క్రీడలతో మానసిక ఉల్లాసం

గంగాధర నెల్లూరు: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని నియోజకవర్గ ప్రత్యేకాధికారి జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి ప్రారంభించారు. జీడీ నెల్లూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రెండవ రోజు బుధవారం పోటీలను అట్టహాసంగా జరిగాయి. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిబాబు, స్థానిక సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఎంఈఓలు గుణశేఖర్ రెడ్డి, ఆంజనేయులు శెట్టి, ఈఓపీఆర్‌డీ రాఘవేంద్ర రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు సెల్వపాండియన్, ఇతర సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించదానికే...

కార్వేటినగరం: యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం.. ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్నారని ఎంపీపీ లత అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొటార్వేడులో సర్పంచ్ శీలా రాణి ఆధ్వర్యంలో ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా గోపిశెట్టిపల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె క్రికెట్ ఆడి యువతలో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మాజీ కన్వీనర్ ధనుంజయవర్మ, ఎంపీటీసీ మురగయ్య, సురేష్, అంకయ్య, ఎంపీడీఓ మోహన్‌మురళి, ప్రత్యేక అధికారి త్రిశూల్, వీఆర్‌ఓ బాబురెడ్డి, కార్యదర్శి వాణి, శేషాద్రి పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం

పెనుమూరు(కార్వేటినగరం): యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం.. ఆంధ్రా క్రీడలను నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సాతంబాకం, మోపిరెడ్డిపల్లిలో ఆడుదాం .. ఆంధ్రా క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దాము, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ రవి, దుర్గారెడ్డి, యతీశ్వర్‌నాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలువురు పాల్గొన్నారు.



విజయపురం : క్రికెట్ పోటీలో తలపడుతున్న ఇల్లత్తూరు క్రీడాకారులు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఈడీ శ్రీదేవి, ప్రజాప్రతినిధులు



కార్వేటినగరం: కొటార్వేడులో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ లత



శాతంబాకంలో క్రీడా సామగ్రిని అందిస్తున్న యశోదారెడ్డి



పాలసముద్రం : సరదాగా కబడ్డీ ఆడుతున్న ప్రజాప్రతినిధులు



వెదురుకుప్పం: మండల స్థాయి పోటీలకు ఎంపికైన గోవిందవారిపల్లె జట్టు

పాలసముద్రంలో..

పాలసముద్రం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. రెండవ రోజు బుధవారం క్రీడాపోటీల్లో భాగంగా క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఖోఖో, కబడ్డీ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా ఆడారు.

వెదురుకుప్పంలో క్రీడా సంబరాలు

వెదురుకుప్పం: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. బుధవారం కొమరగుంట గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన క్రికెట్ పోటీల్లో గోవిందవారిపల్లె టీం విజయం సాధించింది. రన్నర్‌గా దామరకుప్పం టీమ్ నిలిచింది. విజేతలకు ఎంపీటీసీ సభ్యులు మునిచంద్రారెడ్డి, సర్పంచ్‌లు దాక్షాయణి, మమత, డీడీఓ కుమార్, సచివాలయ కన్వీనర్ జగదీశ్‌రెడ్డి బహుమతులు అందజేశారు. అదేవిధంగా తిరుమలయ్యపల్లె–1 సచివాలయ పరిధిలో క్రికెట్ పోటీల్లో బొప్పలమడుగు జట్టు విజయం సాధించి మండల స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించింది.



పాలసముద్రంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న యువకులు

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు బుధవారం 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షల కోసం వచ్చిన తమకు పౌష్టికాహారం అందించడం సంతోషాన్ని కలిగిస్తోందని తెలిపారు. గర్భిణులు, వారి సహాయకులకు విజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీ, పచ్చడి, సాంబారు, రసం, పెరు గన్నం, చిక్కీ, అరటిపండు అందించారు. హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ నారాయణస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.